క్లుప్తంగా

మంత్రిని కలిసిన కార్పొరేషన్ కమిషనర్



మంత్రి శ్రీనివాస్‌తో కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా అతని స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మంత్రికి మొక్కను బహూకరించారు. నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేద్దామని మంత్రి చెప్పారు.

వినతులపై విచారణ



సీఎంఓ గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చిన వినతులపై విచారణ చేపడుతున్న ఆర్డీఓ సూర్యకళ

భోగాపురం: మండలంలోని కంచేరుపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న సుమారు 500 ఎకరాల ప్రభుత్వ భూమిని అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న జీఎంఆర్ సంస్థకు గతంలో కేటాయించారు. అయితే ఈ భూములను ఏళ్ల తరబడి సాగు చేసుకుని జీవిస్తున్నామని, తమకు పరిహారం ఇప్పించాలని స్థానిక రైతులు సీఎంఓ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్డీఓ సూర్యకళ కంచేరుపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను శుక్రవారం పరిశీలించారు. అలాగే స్థానిక రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. సురేష్, ఆర్ఐ కిశోర్, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాములకు పంచామృతాభిషేకాలు



సీతారాములకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం: రామనారాయణం పుణ్యక్షేత్రంలో నాలుగో శ్రావణ శుక్రవారం సందర్భంగా సీతారాములకు పంచామృతాభిషేకాలు.. లక్ష్మీ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అర్చకులు చాణక్య, హర్ష, తేజల నేతృత్వంలో పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నీరజా శ్రీనివాస్, సీతారామయ్యలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

మెలకువలతో అధిక దిగుబడులు



వరిసాగును పరిశీలిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త తేజేశ్వరరావు, తదితరులు

పూసపాటిరేగ : వరిసాగులో మెలకవులతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త తేజేశ్వరరావు అన్నారు. మండలంలోని రెల్లివలసలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని సూచించారు. వరిలో కాలిబాటలు తీసుకుంటే తెగుళ్లను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ, ఎఫ్‌పీఓ ప్రభాకర్, వీఏఏ బి.అనిత, రైతులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం..



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం: 'ఘంటసాల స్వరం ఆరోగ్యానికి వరం'.. 'ఘంటసాల పాట ఆనందానికి బాట' అని పద్మశ్రీ ఘంటసాల స్వరాలయం గౌరవ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు అన్నారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన నూతన కమిటీ సభ్యులచే ఆర్యసోమయాజులు కాశీపతిరావు స్మారక భవనంలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా యామిజాల ప్రభాకర సన్యాసిరావు, కార్యదర్శిగా ధవళ విశ్వకుమార్, కోశాధికారిగా దామరాజు పర్వతాలు, ఉపాధ్యక్షుడిగా తవ్వా మోహనరావు, తదితరులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు మోహనరావు మాట్లాడుతూ, సంఘ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎ. గోపాలరావు, కట్టమూరి చంద్రశేఖరం, మండపాక రవి, ఈఆర్.సోమయాజులు, టీవీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా వనమహోత్సవం



పూసపాటిరేగ: మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ కల్యాణి, ప్రత్యేక అధికారి శాంతకుమారి, తదితరులు



నెల్లిమర్ల: మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ బంగారు సరోజిని



నెల్లిమర్ల రూరల్: వసతిగృహ ఆవరణలో మొక్కలు నాటుతున్న సిబ్బంది



విజయనగరం అర్బన్: మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి



విజయనగరం: నెహ్రూ పార్కులో మొక్కలు నాటుతున్న విజయనగరం ఎమ్మెల్యే, తదితరులు



భోగాపురం: చెరువు గట్టుపై మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నాగమాధవి, టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ సంస్థల కార్యాలయాల వన మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొండవెలగాడ జగనన్న కాలనీ, పీహెచ్‌సీల వద్ద సర్పంచ్ గదల బంగారమ్మ మొక్కలు నాటారు. బొప్పడాం బీసీ బాలుర వసతిగృహ ఆవరణలో సంక్షేమాధికారి రమణ, గ్రామ స్థాయి సిబ్బంది మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో మొక్కలు నాటాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో..

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ పరిసరాల్లో మామిడి, జామ, తదితర దాదాపు 80 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. యూనివర్సిటీ ప్రాంగణంలో రానున్న రెండు నెలల్లో వెయ్యి మొక్కల వరకు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ – 1, యూనిట్ – 2 ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు వి.మణికుమార్, ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ ఎ.శ్రీనివాసులు, డాక్టర్ బి.ధర్మారావు, యూనివర్సిటీ డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి..

పూసపాటిరేగ : మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మండల ప్రత్యేక అధికారి బి. శాంతకుమారి, ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పూసపాటిపాలెం, రెల్లివలస గ్రామాలలో జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ, మొక్కలు నాటడం వల్ల పర్యావరణం సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించినట్లయితే భూమి, వాయు, నీటి కాలుష్యం జరగదన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రాధిక, తహసీల్దార్ తాడ్డి గోవింద, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఓ రత్నమాల, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, టొంపల సీతారాం, పిన్నింటి లక్ష్మీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత
- ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి

విజయనగరం: ప్రాణవాయువునిచ్చే మొక్కలను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి అన్నారు. స్థానిక నెహ్రూ పార్కులో విజయనగరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలను నాటారు. కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు మొక్కలను నాటి అందరిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా శాసన సభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో అవసరమన్నారు. ఆక్సిజన్ అందిస్తున్న మొక్కలు మనిషి జీవనానికి ముఖ్య జీవనాధారమని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ఈఈ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు అవనాపు విజయ్, ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ముద్దాడ మధు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి..

నెల్లిమర్ల: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడమే కాకుండా, వాటిని సంరక్షించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా స్థానిక సీకేఎం జూనియర్ కళాశాల సమీపంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ ఇందిరాబాల, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ..
- ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏపీఓ ఆదిబాబు అధ్వర్యంలో మండలంలోని సుందరపేట ఎండుబంద చెరువు గట్టుపై ఎమ్మెల్యే లోకం నాగమాధవి, టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. సురేష్, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఏఓ హరికృష్ణ, ఈఓపీఆర్డీ సురేష్, జనసేన నాయకులు వందనాల రమణ, పల్లంట్ల జగదీష్, బొల్లు త్రినాథ్, వరుపుల గిరి, గ్రామ ప్రజలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- డిప్యూటీ డీఎంహెచ్ఓ రాణి



సిబ్బందికి సూచనలు అందిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ రాణి

నెల్లిమర్ల రూరల్: సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ కె. రాణి సూచించారు. మండలంలోని కొండవెలగాడలో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం జ్వర పీడితుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఇంటింటా పర్యటించి జ్వర పీడితులను గుర్తించి, చికిత్స అందించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి వై రమణ, హెడ్‌నర్స్ రూతమ్మ, ఏఎన్ఎమ్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణమాస పూజలు



నెల్లిమర్ల రూరల్: పసుపు కొమ్ముల అలంకరణలో రామతీర్థం మహాలక్ష్మి



నెల్లిమర్ల: శిశుమందిర్‌లో సామూహిక వరలక్ష్మీ పూజల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్‌తో పాటు రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామస్వామి ఆలయంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ వై. శ్రీనివాసరావు, అర్చకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే సరస్వతీ శిశుమందిర్‌లో వరలక్ష్మీ పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఇందిరాబాల, చరిత, శాంతికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ క్షేత్రంలో లక్ష్మీ హవనం

విజయనగరం: శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ మాస పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యుల, చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యుల వేదమంత్రాల నడుమ లక్ష్మీ హవనం గావించారు. కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ ,ఉమాదేవి దంపతులు,భక్తులు పాల్గొన్నారు.

ఇదేమి చోద్యం..

- మహంతి చెరువు మధ్యలో రోడ్డు
- పట్టించుకోని కార్పొరేషన్ యంత్రాంగం




మహంతి చెరువు మధ్యలో మట్టితో వేసిన రోడ్డు

విజయనగరం: న్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాత్రికి రాత్రి చెరువుల్లో రోడ్లు వెలుస్తున్నాయి. నగరంలోని కణపాకను ఆనుకుని ఉన్న సర్వే నంబర్ ఆరులో గల మహంతి చెరువు ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. ఇటీవల వరకు నిండుగా తలపించిన చెరువును రెండు భాగాలుగా చేస్తూ రాత్రికి రాత్రి రోడ్డు వెలియడంతో నగర ప్రజలు నివ్వెరబోతున్నారు. గత జూలైలో ఇదే తరహాలో గుర్తు తెలియని వ్యక్తులు చెరువు మధ్య భాగంలో రోడ్డు వేసేందుకు ప్రయత్నించగా.. కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆ చర్యలను అడ్డుకున్నారు. చెరువు గర్భంలో వేసిన మట్టిని యంత్రాలతో తొలగించారు. అయితే తాజాగా రెండు రోజుల కిందట చెరువు మధ్య నుంచి మట్టితో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ఓ వైపు అధికార యంత్రాంగం ప్రకటనలు చేస్తుండగా.. మరోవైపు ఇలా చెరువుల్లో రోడ్లు పుట్టుకు రావటం విశేషం. ఇప్పటికైన అధికారులు స్పందించి చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ప్రజా చైతన్యంతోనే మార్పు

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



పాలాస్పత్రి వద్ద మస్టర్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయగనరం: ప్రజా చైతన్యంతోనే నగర అభివృద్ధిలో మార్పు తీసుకురావచ్చని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో కమిషనర్ పి. నల్లనయ్య శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రాజీవ్ స్టేడియం ఎదురుగా ఉన్న వాహన డిపోను సందర్శించి, చెత్త తరలించే వాహనాల పరిస్థితి పరిశీలించారు. పాడైన వాహనాలకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పాలాస్పత్రిలో ఉన్న మస్టర్ పాయింట్‌కు తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. స్థానిక నెహ్రూ పార్కులో ఆర్ఓ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. పార్క్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చొరవ చూపాలని ఆదేశించారు. ఆ తర్వాత మూడులాంతర్ల నుంచి అంబటిసత్రం వరకు ఉన్న కాలువలపై పలకలను తొలగించి కాలువలలో పేరుకుపోయిన పూడికలను తొలగించాలన్నారు. నగరంలో ఎక్కడా పోస్టర్లు, గోడ రాతలు ఉండరాదన్నారు. టీ దుకాణాలలో ప్లాస్టిక్ కప్పులు గాని, సింగల్ యూజ్ కప్పులు గాని వినియోగించరాదని, ఈ విషయమై వ్యాపారులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

కాలుష్య కారణాలను విశ్లేషించండి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలో వాయు కాలుష్యానికి కారణాలను విశ్లేషించి, నియంత్రణకు పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం అమలుపై తన చాంబర్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశంలో వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న నగరాల జాబితాలో విజయనగరం కూడా ఉండడానికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. వాయు కాలుష్య కారణాలను గుర్తిస్తే దాని నివారణ సులువవుతుందని.. ఆ దిశగా ప్రయత్నించాలని సూచించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం కింద ఇంతవరకు సుమారు రూ.4.5 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవడానికి సుమారు రూ.2.65 కోట్లతో తగిన ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. మొక్కలను ఎక్కువగా నాటడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని.. దీని కోసం చార్జింగ్ పాయింట్లను ఎక్కువగా ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలోని పెట్రోల్ బంకులన్నింటినీ తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సరిత, వ్యవసాయశాఖ జె.డి రామారావు, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, డీఎస్ఓ మధుసూదనరావు, మున్సిపల్, పోలీస్, పరిశ్రమలు, తదితర శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడే పింఛన్ల పంపిణీ..

సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడం వల్ల ఒక రోజు ముందే శనివారం పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, మెడికల్ అధికారులతో పింఛన్ల పంపిణీ, శానిటేషన్ డ్రైవ్, సీజనల్ వ్యాధులపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల పంపిణీలో సాంకేతిక లోపాలు తలెత్తినట్లైతే గ్రూప్‌లో పోస్ట్ చేసిన నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. అలాగే డీఆర్‌డీఏ కార్యాలయంలో ఉదయం 5 గంటల నుంచే కాల్ సెంటర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, డీపీఓ శ్రీధర్‌రాజా, డీఎంహెచ్ఓ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- తహసీల్దార్ సురేష్



ఎస్సీ కాలనీవాసులతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ అప్పలనాయుడు

భోగాపురం: ఎస్సీ కాలనీలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ అప్పలనాయుడు, సీఐ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కాలనీవాసులతో తహసీల్దార్, ఎంపీడీఓ, సీఐ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలనీలో ఏమైనా సమస్యలున్నాయా అని కాలనీవాసులను ప్రశ్నించారు. దీనిపై కాలనీవాసులు స్పందిస్తూ..సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, శ్మశానవాటికకు వెళ్లే మార్గానికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. అదేవిధంగా ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని, శిథిలావస్థలో ఉన్న అంబేడ్కర్ భవనాన్ని తొలగించి.. దాని స్థానంలో కొత్త భవనాన్ని ఏర్పాటు చేసుకునేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి అధికారులు స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. సమావేశంలో సర్పంచ్ ఊడికల అప్పయ్యమ్మ, పచ్చిపాల గురునాథ్, గురువులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిశోర్, వీఆర్వో రాముడునాయుడు, పంచాయతీ ఈఓ మంగం సురేష్, ఎస్సీ కాలనీవాసులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



కృష్ణుడు, గోపిక వేషధారణలలో చిన్నారులు



కోలాటం చేస్తున్న మహిళలు

విజయనగరం టౌన్: ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురజాడ కళాభారతి ఆడిటోరియంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాలలో విజయనగరం శాసనసభ్యురాలు అదితి గజపతిరాజు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి పల్లకీ ఊరేగింపును ప్రారంభించారు. సమితి అధ్యక్షుడు వానపల్లి శంకరరావుతో కలిసి శ్రీకృష్ణుని ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందన్నారు. ముగింపు ఉత్సవాల ర్యాలీ సింహాచలం మేడ, మూడులాంతర్లు, ఎంజీ రోడ్డు, కన్యకా పరమేశ్వరి ఆలయం, హుకుంపేట, కొత్తపేట నీళ్ల ట్యాంక్ మీదుగా తిరిగి గురజాడ కళాభారతి ఆడిటోరియం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా చిన్నారులు గోపిక, కృష్ణుని వేషధారణలతో అలరించారు. మహిళల కోలాట ప్రదర్శనలు, చెక్క భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కూటమి నాయకులు అవనాపు విజయ్, గురాన అయ్యలు, ఐవీపీ రాజు, ముద్దాడ మధు, అప్పలనాయుడు, సమితి సభ్యులు సీవీఎస్ నాయుడు, ఆదినారాయణ, వంశీ, రాజేష్, సూరిబాబు, దుర్గారావు, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు సీజ్

విజయనగరం ఫూల్‌బాగ్: మండలంలోని గుంకలాం సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్, జేసీబీని మైన్స్ విజిలెన్స్ ఎ.డి విజయలక్ష్మి శుక్రవారం సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను సేఫ్ కస్టడీకి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనుమతుల్లేకుండా ఇసుక, గ్రావెల్ తరలిస్తే చర్యలు తప్పవన్నారు.